బాబోయ్ దోమలు





• బెంబేలెత్తుతున్న పట్టణవాసులు • నామమాత్రంగా యాంటీలార్వా ఆపరేషన్లు

గాజువాక: దోమలబెడద పెరిగిపోతోంది. చెత్తపై కొత్త సమరం ప్రకటించినా, పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక కార్యక్రమం తలపెట్టినా.. కార్యాచరణ కానరాకపోవడంతో దోమల బెడదను నివారించలేకపోతున్నారు. విపరీతంగా పెరిగిపోతున్న దోమలు పట్టణ వాసులను బెంబేలెత్తిస్తున్నాయి. నివాస ప్రాంతాల్లోని మురుగునీటి కాల్వల్లో నీరు కదలకపోవడంతో నివాసితులు దోమలబెడదకు గురవుతున్నారు. దీనికి వర్షపునీరు తోడవడంతో సమస్య జటిలమైంది. దోమల నివారణకు ఉద్దేశించిన సిబ్బంది వార్డుల్లో కనిపించని పరిస్థితి నెలకొంటోందని జనం గగ్గోలు పెడుతున్నారు. మరోవైపు అధికారుల పర్యవేక్షణ కొరవడిందని ప్రజలు మండిపడుతున్నారు. మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణకు వివిధ కార్యాక్రమాలతో అధికారులు ప్రచారం చేస్తున్నా దోమల నివారణపై మాత్రం గ్రేటర్ అధికారులు పెద్దగా పట్టించుకోవడం లేదని ఆరోపణలున్నాయి.

నామ మాత్రమే

దోమల నివారణ కోసం శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఆయనకు పది మంది ఆరోగ్య సహాయకులు ఉన్నారు. అయినప్పటికీ దోమల నియంత్రణ చర్యలు నామ మాత్రంగానే సాగుతున్నాయి. దోమలు, క్రిముల నియంత్రణకు ఫాగింగ్‌వంటి చర్యలు ఎప్పుడో గాని కనిపించడంలేదు. ఈ విషయాన్ని సంబంధిత అధికారుల వద్ద ప్రస్తావించినా ఫాగింగ్ ఒక్కదాని వల్లే దోమల నివారణ సాధ్యం కాదంటూ కొట్టిపారేస్తున్నారు. గాజువాక జోన్‌లో మురుగునీటి కాల్వలకు ఔట్‌లెట్ వ్యవస్థ లేకపోవడంతో వ్యర్థ జలాలు నివాసాల మధ్యే నిల్వ ఉండిపోతున్నాయని చెబుతున్నారు.



రోజుల తరబడి నీరు ఇలా ఉంటే... దోమలు విజృంభించవా..

ప్రజల బడ్జెట్టే అధికం

దోమల నివారణ కోసం జీవీఎంసీ కంటే ప్రజలే అధికంగా ఖర్చు పెడుతున్నారు. నిర్దిష్టమైన ప్రణాళిక లేకపోయినా ప్రజారోగ్యంపై పని చేసే సిబ్బంది, అధికారులకు సంక్షేమం, పని ముట్లు తదితర అంశాలపై నెలకు రూ.30 లక్షల వరకు జీవీఎంసీ ఖర్చు చేస్తున్నట్టు చెబుతున్నారు. గాజువాక జోన్‌లో లక్షా పదివేల అసెస్‌మెంట్లతో సుమారు లక్షా ఇరవై వేల కుటుంబాల వరకు ఉన్నాయి. ఈ కుటుంబాలు తమ ఇళ్లలోకి దోమలు రాకుండా ఉండడం కోసం వివిధ లిక్విడ్‌లు, కాయిల్స్ కొనుగోలుకు లక్షల్లో వెచ్చిస్తున్నారు. నెలకు సుమారు రూ.52లక్షల వరకు ఖర్చు చేస్తున్నట్టు అంచనా. ఈ లెక్కన జీవీఎంసీ సగం నిధులు కూడా ఖర్చు చేయడం లేదని తెలుస్తోంది. జీవీఎంసీ చేపట్టే ప్రతి చర్యలకు నిర్ణయం ప్రధాన కార్యాలయంలో తీసుకోవాల్సి ఉండడంతో ఇక్కడి అధికారులు చేతులెత్తేస్తున్నారు. ప్రజారోగ్య సిబ్బందికి పనిముట్లే సక్రమంగా ఇవ్వని పరిస్థితి నెలకొనడంతో అధికారులు దిక్కులు చూస్తున్నారు.

రోగాలు ఇక్కడే అధికం

దోమల వల్ల వ్యాపించే మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ జ్వరాలు గాజువాక ప్రాంతంలోనే అత్యధికంగా నమోదవుతున్నాయి. గాజువాకలోని వివిధ పీహెచ్‌సీల పరిధిలో ఏడాదిన్నర కిందట 15 డెంగ్యూ కేసులు నమోదయ్యాయి. ఇప్పటికీ అక్కడక్కడా డెంగ్యూ అనుమానిత కేసులు నమోదవుతున్నాయి. మలేరియా జ్వరాలకు గురైనవారు వందల మంది ఉన్నారు. ఇలాంటి రోగాలు వెలుగు చూసినప్పుడు సంబంధిత అధికారులు ఆయా ప్రాంతాలకు వెళ్లి పారిశుద్ధ్య నిర్వహణలో పాల్గొనడం, వైద్య శిబిరాలు నిర్వహించడానికే పరిమితమవుతున్నారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలో విఫలమవుతున్నారని నివాసులు ఆరోపిస్తున్నారు.

ఇళ్లలోనూ జాగ్రత్తలు తీసుకోవాలి

ఇళ్లలో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పాత టైర్లు, ఖాళీ కొబ్బరి బొండా లు లేకుండా చూడాలి. కుండీల్లో కూడా నీరు నిల్వ లేకుండా చూడాలి. వాటిలో చేరే నీటివల్ల మలేరియా దోమలు, లార్వా ఉత్పన్నమవుతాయి. ఫలితంగా మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ వంటి రోగాలకు గురయ్యే అవకాశం ఉంది. నీటి వాడకంలో వారానికి ఒకసారి డ్రైడే పాటించాలి. ఇంట్లో నీటి నిల్వకు అవకాశం ఉన్నవాటిని ఆ రోజు శుభ్రంగా కడిగేసి బోర్లించుకోవడంద్వారా కొంత ఫలితాన్ని సాధించవచ్చునని వైద్య నిపుణులు చెబుతున్నారు. నీటి వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మలేరియా సిబ్బంది, పీహెచ్‌సీ సిబ్బంది చేపడుతున్న అవగాహన కార్యక్రమాలను మరింత పెంచితే బాగుంటుంది.

నిరుపేదల చదువులకు ప్రోత్సాహం



నిర్మాణంలో ఉన్న భవనాన్ని పరిశీలిస్తున్న అజినో మోటో ఫార్మా కంపెనీ ఎండీ రాజు

అగనంపూడి: అజినో మోటో ఫార్మా కంపెనీ పేదల చదువులకు అండగా ఉంటుందని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కె.వి.వి.రాజు అన్నారు. 85వ వార్డు అగనంపూడి నిర్వాసితకాలనీ పినమడక ఉన్నత పాఠశాల ఆవరణలో భవనాలు శిథిలం కావడంతో వాటిని తొలగించి నిర్మిస్తున్న మూడు అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సంస్థ సీఎస్ఆర్ నిధులతో ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు కల్పించడం తమ ధ్యేయమన్నారు. పాఠశాలను దత్తత తీసుకొని మొదటి విడతగా రూ.42 లక్షల వ్యయంతో మూడు అదనపు భవనాలు నిర్మిస్తున్నామన్నారు. సర్వశిక్షా అభియాన్ ఈఈ డి.వి.నరసింహారావు మాట్లాడుతూ సంస్థ సీఎస్ఆర్ నిధులతో పాఠశాలలోని విద్యార్థులను అవస్థలు, అవసరాలను గుర్తించి అదనపు తరగతి గదులు నిర్మిస్తుండడం సంతోషంగా ఉందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.బ్రహ్మానందం, సంస్థ మేనేజర్ పి.అభిరామ్, బలిరెడ్డి సత్యనారాయణ, కిడిమి హనుమంతురావు, ఇ.అర్జున్, ఉపాధ్యాయులు కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పూర్తి ఉత్పత్తికి కృషి చేయాలి



మాట్లాడుతున్న అయోధ్యరామ్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్‌ఫర్నేస్–3 పునః ప్రారంభించడం శుభసూచకమని, ఇదే సమయంలో పూర్తి స్థాయి ఉత్పత్తి సాధించడానికి అందరూ కృషి చేయాలని స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె. అయోధ్యరామ్ కోరారు. స్థానికంగా శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు ప్రస్తుతం రెండు బ్లాస్ట్‌ఫర్నేస్‌ల్లో సరాసరి 14 వేల టన్నుల హాట్‌మెటల్ తయారవుతుందన్నారు. మార్చి నెలలో రూ. 14 కోట్లు, ఏప్రిల్‌లో రూ.72 కోట్లు, మేలో రూ. 52 కోట్ల వరకూ లాభాలు వచ్చాయన్నారు. బీఎఫ్–3 ద్వారా మరింత ఉత్పత్తి పెంచడంతో పాటు టర్నోవర్ పెంపునకు కృషి చేయాలన్నారు. యాజమాన్యం మూడు ఫర్నేస్‌ల ఉత్పత్తికి అవసరమైన రా మెటీరియల్ సమకూర్చడానికి చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా ఉద్యోగులకు పూర్తి జీతం చెల్లింపు, పెండింగ్ జీతాల చెల్లింపు వంటి సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధానకార్యదర్శి యు.రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల అందజేత



వస్తువులు అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రతినిధులు కొక్కిరాపల్లి గ్రామంలోని ప్రేమ సమాజం నిర్వహిస్తున్న వృద్ధాశ్రమానికి వెళ్లి బియ్యం, కంది పప్పు, రవ్వ, నూనె, ఉల్లిపాయలతో పాటు కూరగాయలు అందజేశారు. కార్యక్రమంలో సత్యసాయి సమితి సేవాదళ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో సీజనల్ వ్యాధులకు చెక్



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ప్రదీప్‌ప్రసాద్‌రాజా

పెదగంట్యాడ: వాతావరణ మార్పుల నేపథ్యంలో పిల్లలు, పెద్దలు అతిసార వ్యాధి (డయేరియా) బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని దేవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ ప్రసాద్‌రాజా అన్నారు. దేవాడ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం పరిసర గ్రామాల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బయట ఎండలో పనిచేసే వారికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రదీప్ మాట్లాడుతూ రోడ్ల పక్కన విక్రయించే ఆహారం,చల్లని రంగుల పానీయాలు తీసుకోకూడదని సూచించారు. బాలింతలు చిన్నపిల్లలకు ఆరు నెలలు వచ్చే వరకూ కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది కె. అన్నపూర్ణ, ఎం. శ్రీనివాసరావు, హెచ్ఎస్ గోపాల్, ఎన్. సునీత, ఎం. దేవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన



విద్యార్థినిని అభినందిస్తున్న కరస్పాండెంట్ విజయలక్ష్మి

గాజువాక: పీజీ సెట్ ఫలితాల్లో రెండో ర్యాంక్ సాధించిన పి.కావ్యను ఆ కళాశాల కరస్పాండెంట్ జి.విజయలక్ష్మి అభినందించారు. చైతన్య కళాశాల విద్యార్థి లైఫ్ సైన్సెస్ విభాగంలో అత్యుత్తమ ర్యాంక్ సాధించడం గర్వకారణంగా ఉందని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు.

జిల్లా స్టాటిస్టికల్ ఆఫీసర్‌గా విజయలక్ష్మి

మహారాణిపేట: రేసపువానిపాలెంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో జిల్లా స్టాటిస్టికల్ ఆఫీసర్‌గా విజయలక్ష్మి శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. కాకినాడ డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి ఇక్కడికి బదిలీపై ఆమె వచ్చారు. అనంతరం వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయంలో డిప్యూటీ డైరెక్టర్ రమణమూర్తిని మర్యాదపూర్వకంగా విజయలక్ష్మి కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

జీవీఎంసీ వాటర్ సప్లై కార్మికుల సమ్మె

నిలిచిపోయిన నీటి సరఫరా



ఆందోళన చేస్తున్న కార్మికులు



కార్మికులతో చర్చిస్తున్న అధికారులు

గాజువాక/కూర్మన్నపాలెం: పెంచిన వేతనాలు అమలు చేయకపోవడంతో ఆ సంస్థ నీటి సరఫరా విభాగంలో పని చేస్తున్న కార్మికులు సమ్మెకు దిగారు. జీవీఎంసీ అవుట్ సోర్సింగ్ కార్మికులకు పెరిగిన వేతనాల బిల్లు పెట్టి, మళ్లీ తొలగించారని తెలిసిన కార్మికులు ఈ నెల 11న టూల్‌డౌన్ కార్యక్రమం చేపట్టగా, కార్మికులతో చర్చించిన అధికారులు 15 రోజుల్లో కొత్త వేతనాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం హామీని అమలు చేయపోవడంతో కార్మికులు శుక్రవారం తెల్లవారు జామునుంచి నిరవధిక సమ్మెకు దిగారు. నీటి సరఫరా విభాగంలోని వివిధ సెక్షన్లకు చెందిన కార్మికులు తాము పని చేస్తున్న సెక్షన్లలో పని నిలిపివేసి సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాజువాక జోన్‌లోని సుందరయ్య కాలనీ పంప్ హౌస్, సిద్ధార్థనగర్ పంప్ హౌస్‌ల పరిధిలోని అన్ని విభాగాల కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుందరయ్య కాలనీ పంప్‌హౌస్‌వద్ద ఆందోళనకు దిగారు. తమకు పెరిగిన వేతనాలను తక్షణమే అమలు చేయాలని, లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని కార్మికులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు సాగి సునీల్, పి.గోవింద, దుగ్గపు దానప్పలు, కృష్ణ, భాస్కరరాజు, రామకృష్ణరాజు, సూరిబాబు, పల్లా అప్పలరాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన నీటి సరఫరా

కాగా కార్మికులు తెల్లవారు జామునుంచే సమ్మెకు దిగడంతో గాజువాక, వడ్లపూడిలోని అనేక ప్రాంతాలకు మంచినీటి సరఫరా నిలిచి పోయింది. దీంతో ప్రజలు తాగునీటి కోసం అవస్థలు పడ్డారు. సమ్మె ఇలాగే కొనసాగితే పరిస్థితి దారుణంగా ఉంటుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అత్యవసరమైన మంచినీటి సరఫరా విషయంలో ప్రభుత్వం రెండో ఆలోచన చేయకుండా కార్మికుల సమస్య పరిష్కారానికి చొరవ చూపాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

మత్స్యావతారంలో జగన్నాథుడు

అగనంపూడి: స్థానిక జగన్నాథస్వామి ఆలయంలో ఉత్సవమూర్తి మత్స్య అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సుభద్ర, బలభద్రుడి సమేత జగన్నాథ స్వామిని ఆలయ ప్రధాన అర్చకులు గురు సంతోష్ మత్స్య అవతారంలో అలంకరింపజేశారు.

కూర్మావతారం నేడు...

స్థానిక ఇంద్రద్యుమ్నహాలు వద్ద భక్తుల దర్శనం కోసం ఉంచిన జగన్నాథస్వామి శనివారం కూర్మావతారంలో భక్తులకు దర్శమివ్వనున్నారు. దశావతారాల్లో భాగంగా స్వామి వారిని రోజుకో అవతారంలో అలంకరింపజేసి భక్తులకు దర్శనం కల్పించనున్నట్టు ఆలయ ఈవో పద్మావతి తెలిపారు.



మత్స్య అవతారంలోస్వామి

కారును ఢీకొట్టిన ఆటో

ఉక్కునగరం: ఆగి ఉన్న కారును వెనుక నుంచి స్కూల్ విద్యార్థులతో వెళ్తున్న ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని ప్రైవేటు స్కూల్‌కు చెందిన విద్యార్థులు కూర్మన్నపాలెం నుంచి ఆటోలో వస్తున్నారు. ఉక్కు జనరల్ ఆస్పత్రి వద్దకు వచ్చేసరికి అక్కడ ఆగి ఉన్న కారును ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే వారిని పక్కనే ఉన్న జనరల్ ఆస్పత్రికి తీసుకు వెళ్లి ప్రాథమిక చికిత్స అనంతరం ఇంటికి పంపేశారు. ప్రమాదంలో ఆటో ముందు భాగం దెబ్బతింది. ఎటువంటి ఫిర్యాదు అందలేదని స్టీల్‌ప్లాంట్ పోలీసులు తెలిపారు.



దెబ్బతిన్న ఆటో

పిల్లల్లో పుట్టుకతో వచ్చే వ్యాధులను గుర్తించాలి

మహారాణిపేట: పిల్లల్లో పుట్టుకతో వచ్చే శారీరక, మానసిక లోపాలను తొందరగా గుర్తించి, సరైన వైద్యసేవలు అందించేందుకు వైద్యులు సిద్ధంగా ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆదేశించారు. జిల్లా స్థాయి వైద్యులు, ఆరోగ్య కార్యకర్తలకు రేసపువానిపాలెంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 18 సంవత్సరాల లోపు పిల్లలకు పుట్టుకతో వచ్చే సమస్యలను గుర్తించి, వైద్య సేవలు అందించాలన్నారు. ప్రతీ చిన్నారికి సమగ్ర ఆరోగ్య పరీక్షలను తగిన మార్గదర్శకాలు పాటిస్తూ అన్ని శాఖల సమన్వయంతో విజయవంతంగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారి డాక్టర్ బి.హారిక, వివిధ విభాగాల అధికారులు డాక్టర్ వి.సంధ్యారాణి, ఇ.శాంతిప్రియ తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

రైతుబజార్‌లో తనిఖీలు

తాటిచెట్లపాలెం: సీతమ్మధార రైతుబజార్‌లో శుక్రవారం మార్కెటింగ్ శాఖ డీడీ శ్రీనివాస కిరణ్ పర్యటించి, తనిఖీలు చేశారు. బజార్‌లోని ప్రతి స్టాల్‌ను సందర్శించి అక్కడ పరిస్థితులను గమనించారు. వినియోగదారులకు నాణ్యమైన కూరగాయలు అందించాలని, ఉల్లిపాయలు, టమోటా స్టాళ్లలో విక్రయాల్లో నాణ్యతను కచ్చితంగా పాటించాలని ఆయన ఆదేశించారు. డీడీ వెంట రైతుబజార్ ఈవో కృష్ణమూర్తి, సహాయకుడు సతీష్ ఉన్నారు.



స్టాళ్లను పరిశీలిస్తున్న మార్కెటింగ్ శాఖ డీడీ శ్రీనివాస కిరణ్

కదిలిన రథం.. పులకించిన జనం



రథం వద్ద పూజలు చేస్తున్న తిప్పల దేవన్‌రెడ్డి, మంత్రి శంకరనారాయణ తదితరులు



అగనంపూడిలో రథాన్ని లాగుతున్న భక్తులు

రథాన్ని లాగడానికి పోటీ పడిన భక్తులు

అగనంపూడి: జగన్నాథస్వామి రథ చక్రాలు కదిలాయి. రథోత్సవం సందర్భంగా శుక్రవారం సాయంత్రం సుభద్ర, బలభద్రుని సహిత జగన్నాథస్వామిని ఆలయం నుంచి పండా కుటుంబీకులు గురు త్రినాథ్, మోహన్, గోవింద్, ఇతర కుటుంబీకులు రథంపైకి తీసుకువచ్చారు. అనంతరం మంగళవాయిద్యాలు, కోలాట ప్రదర్శనలతో రథాన్ని జాతీయ రహదారిపై కదిలించారు. వంద మీటర్ల దూరంలోని ఇంద్రద్యుమ్నహాలు వద్దకు చేరుకోడానికి సుమారు గంటన్నర సమయం పట్టడంతో ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కిల్లి వెంకటరావు ఆధ్వర్యంలో పోలీసులు చర్యలు చేపట్టారు. 79,85,87వ వార్డుల కార్పొరేటర్లు రౌతు శ్రీనివాసరావు, ఇల్లపు వరలక్ష్మి ప్రసాద్, బొండా జగన్నాథం రథాన్ని లాగుతూ ముందుకు సాగారు. తదనంతరం భక్తులు పోటీ పోడి రథాన్ని లాగుతూ భక్తిప్రపత్తులు చాటుకున్నారు. కార్యక్రమంలో గవర సోమశేఖర్, కర్రి దేవేంద్ర, కోసూరి తాతారావు, గ్రామ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో..

ఉక్కునగరం: జగన్నాథుడి రథయాత్ర ఉక్కునగరంలో శుక్రవారం వైభవంగా జరిగింది. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మొదట స్టీల్‌ప్లాంట్ ఇన్‌చార్జి సీఎండీ అజిత్ కుమార్ సక్సేనా జగన్నాథునికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సుభద్ర, భలబద్ర సమేత జగన్నాథుడి ఉత్సవ విగ్రహాలను రథంపైకి తరలించారు. ఈ సందర్భంగా సక్సేనా సంప్రదాయ దుస్తుల్లో బంగారు చీపురుతో రథాన్ని శుభ్రం చేసారు. జై జగన్నాథ్ నామ స్మరణతో రథాన్ని ఊరేగించారు. ఉక్కునగరంలోని పలు సెక్టార్ల మీదుగా రథం సెక్టార్–8కు చేరుకుంది. భజనలు, కోలాటాలు, నత్య ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ ఉన్నతాధికారులతో పాటు ఉత్కళ్ కల్చరల్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథుడు

ఘనంగా జగన్నాథస్వామి రథయాత్ర

పెదగంట్యాడ: మండలంలో శుక్రవారం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. సంకీర్తనలు, కోలాటాలు, భజనలు, వేదమంత్రాలతో పులకరించింది. ఎక్కడ చూసినా భక్తుల సందడే. జగన్నాథస్వామి స్వామి రథయాత్రను ఘనంగా నిర్వహించారు. జీవీఎంసీ 76వ వార్డు పరిధి హౌసింగ్ బోర్డు కాలనీలోని జగన్నాథస్వామి ఆలయంలో నీలాచల్ కల్చర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బలభద్ర, సుభద్రతో పాటు జగన్నాథ స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, 76వ వార్డు అధ్యక్షుడు మంత్రి శంకరనారాయణ, ఆలయ ప్రధాన అర్చకుడు ప్రమోద్ సారంగి అధ్యక్షతన ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాలను రథంపై కూర్చుబెట్టి రథయాత్రను అంగరంగా వైభవంగా తిప్పల దేవన్‌రెడ్డి ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో ముమ్మిడిశెట్టి ముత్యాలశెట్టి, జీలకర్ర రమణ, భువనేశ్వరి పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రథాన్ని లాగుతున్న నాయకులు



జగన్నాథుని రథయాత్రలో పాల్గొన్న స్టీల్‌ప్లాంట్ ఇన్‌చార్జి సీఎండీ సక్సేనా



రథయాత్ర ముందు కోలాటం ఆడుతున్న చిన్నారులు , మహిళలు

పెదగంట్యాడ పీహెచ్‌సీ వైద్యాధికారిగా సంపత్ బాబు



డాక్టర్ సంపత్ బాబుకు స్వాగతం పలుకుతున్న సిబ్బంది

పెదగంట్యాడ: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా డాక్టర్ సంపత్ బాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కొయ్యూరు మండలం ఆర్‌జె పురం నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ వైద్యాధికారిగా పని చేసిన డాక్టర్ రమేష్‌బాబు దేవరాపల్లి మండలం వేచలంకి బదిలీ అయ్యారు. డాక్టర్ సంపత్‌బాబుకు వైద్యాధికారి డాక్టర్ హేమలత, ఆరోగ్య విస్తరణాధికారి సత్యనారాయణ, సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

జాతీయ సమ్మెను జయప్రదం చేయండి

తాటిచెట్లపాలెం: జూలై 9న నిర్వహించనున్న జాతీయ సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. 45వ వార్డు నరసింహనగర్‌లో శుక్రవారం మున్సిపల్ కార్మికులు, సీఐటీయూ నాయకులు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, కాంట్రాక్టు కార్మికులందరినీ పెర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ కార్మికులకు, ప్రజలకు తీవ్ర నష్టం చేకూర్చుతోందన్నారు. మోదీ ప్రభుత్వం కార్మికులను బానిసలుగా మార్చే లేబర్ కోడ్‌లు తీసుకొచ్చిందని, వెంటనే వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్‌లో 5 వేల మంది కార్మికులను కేంద్ర ప్రభుత్వం తొలగించిందని, ప్లాంట్ కార్మికులను చంద్రబాబు ప్రభుత్వం పోలీసులతో అణచివేస్తోందన్నారు. ఈ చర్యలన్నింటినీ నిరసిస్తూ జూలై 9న తలపెట్టిన జాతీయ సమ్మెలో కార్మికులంతా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో జోన్ సెక్రటరీ ఒ.అప్పారావు, ప్రెసిడెంట్ ఎస్.శ్రావణ్‌కుమార్, సీఐటీయూ జిల్లా నాయకులు యు.ఎస్.ఎన్.రాజు, నాయకులు ఎన్.ప్రకాశరావు, వి.సీతాలక్ష్మి, రమణమ్మ, వెంకటలక్ష్మి, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.



నరసింహనగర్‌లో ప్రచారం చేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

కనకమహాలక్ష్మి అమ్మవారికి క్షీరాభిషేకం

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి

నేడు సిరులతల్లికి తులసి పూజ : కనకమహాలక్ష్మి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నెంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు ట్రాన్సాక్షన్ వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సాప్ చేయాలి.